క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు సాయం అందిస్తున్న అధికారులు, రెస్‌క్రాస్ బృందం

ఏలూరు టౌన్ : భీమడోలు అర్జావారిగూడెంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బోయిన బేబీ, బోయిన శాంతరాజు కుటుంబాలకు ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆదేశాలతో రెడ్‌క్రాస్ వలంటీర్లు శుక్రవారం సాయం అందజేశారు. వంట పాత్రలు, దుప్పట్లు, నిత్యావసర సరుకుల కిట్లను భీమడోలు తహసీల్దార్ షేక్ షంషుద్దీన్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ వినయ్‌కుమార్, భీమడోలు సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్, రెడ్‌క్రాస్ వలంటీర్లు వి.నాగరాజు, హరీష్ తదితరులు ఉన్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి



వేడుకల్లో పాల్గొన్న స్పిరిచ్యువల్ మూవ్‌మెంట్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఒన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేద పఠనం, సంగీత వాయిద్య కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. రాధా జోష్యుల మాట్లాడుతూ దుఃఖం అనేది ప్రపంచమంతా ఉందని, దీనికి కారణం మితిమీరిన కోరికలు, అజ్ఞానమేనని వివరించారు. అజ్ఞానం పోవాలంటే బుద్ధుడు చెప్పిన అష్టాంగ మార్గాన్ని ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజేటి శేషగిరి రావు, మాజేటి శ్యామల, ఎర్నేని ప్రసాద రావు, సురగాని రవీంద్ర, కూర్మాల లక్ష్మి, నామగిరి మంజులత తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి



కారల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మానవ మనుగడకు మంచి మార్గాన్ని చూపిన, ప్రపంచానికి మార్క్సిజాన్ని అందించిన కారల్ మార్క్స్ మహనీయుడని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు కొనియాడారు. స్థానిక పవరు పేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో కారల్ మార్క్స్ 205వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. నరసింహారావు కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కారల్ మార్క్స్ ఉన్నతమైన సంపన్న కుటుంబంలో జన్మించి 1840 నాటికి పీహెచ్‌డీ చేసి ఆయన తత్వ శాస్త్రం, న్యాయ శాస్త్రం, చరిత్ర వంటి అనేక శాస్త్రాలను అధ్యయనం చేశారని వివరించారు. ప్రపంచంలోనే గొప్పదైన లండన్ మ్యూజియంలోని వేలాది పుస్తకాలను చదివిన మొదటి వ్యక్తిగా ఆయన నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎ.శ్యామలరాణి, జిల్లా నాయకులు పి.ఆదిశేషు, నగర నాయకులు వి.సాయిబాబు, జె.గోపి, కట్టా సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, ఎం.సత్యం, బి.త్రినాథ్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే లక్ష్యం

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం

ఏలూరు రూరల్ : అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు మండల గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. తడిచిన ధాన్యాన్ని గుర్తించి రైతులతో చర్చిస్తున్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు తరలిస్తున్నారు. మరోపక్క రైస్ మిల్లుల్లోనూ తనిఖీ చేస్తున్నారు.

4,330 మెట్రిక్ టన్నుల దిగుమది అంచనా

ఏలూరు మండలం మల్కాపురం, చొదిమెళ్ల, వెంకటాపురం, తంగెళ్లమూడి, శనివారపుపేట, సత్రంపాడు గ్రామాల పరిధిలో 1,207 ఎకరాలు రైతులు వరి సాగు చేశారు. ఈ క్రాఫ్ బుకింగ్ ద్వారా మొత్తంగా 4,330 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే ఎఫ్‌సీఐ మిల్లర్ల ద్వారా 2,456 మెట్రిక్ టన్నులు సేకరిస్తామని వెల్లడించింది. ఇప్పటి వరకు అధికారులు 1,623 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించి ఎఫ్‌సీఐకు తరలించారు. మరో 1878 మెట్రిక్ టన్నులు సేకరించాల్సుంది. ఇందులో 1,168 మెట్రిక్ టన్నులు ఒక్క మల్కాపురం నుంచే సేకరించాల్సుంది. ఈ గ్రామంలో రైతులు అత్యధికంగా 840 ఎకరాల్లో వరి సాగు చేశారు.

మరింత సేకరణ

రైతుల నుంచి ఎఫ్‌సీఐ మరిన్ని టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



మల్కాపురంలో తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్

రైతులు నష్టపోకుండా చర్యలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి తడిచిన ధాన్యాన్ని సైతం సేకరిస్తున్నాం. ఎఫ్‌సీఐ 2456 టన్నులు సేకరిస్తామని టార్గెట్ ఇచ్చింది. ఇప్పటి వరకూ 1623 టన్నులు సేకరించాం. మిగిలినది సైతం సేకరిస్తున్నాం. మండల టార్గెట్ కన్నా అధనంగా ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్‌కి నివేదించాం. రైతులకు నష్టం రాకుండా చర్యలు తీసుకున్నాం.

– ఎ.జీవనసంధ్య, ఎంపీఓ.

నిత్యం రైతులతో మాట్లాడుతున్నాం



ప్రతిరోజూ గ్రామాల్లో రైతులను కలుసుకుంటున్నాం. వర్షాల కారణంగా తడిచిన ధాన్యాన్ని పరిశీలించాం. రైతులకు అన్ని విధాల సహాయం చేస్తున్నాం. మిల్లర్లతో సైతం మాట్లాడి రైతులు ధాన్యాన్ని మిల్లర్లకు తరలిస్తున్నాం. ఒక్క బస్తా కూడా వదిలేది లేదు. ఏ రైతు నష్టపోకూడదన్నదే ప్రభుత్వం ఆదేశం.

– బి.సోమశేఖర్, మండల నోడల్ ఆఫీసర్

ఎఫ్‌సీఐ ఇచ్చిన 2,456 మెట్రిక్ టన్నుల టార్గెట్ కన్నా రైతులు అధికంగా దిగుమతి సాధించారు. వ్యవసాయ అధికారులు అంచనా ప్రకారం మరో 1900 టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ సేకరించాల్సి ఉంది.

ప్రజల సంక్షేమానికే పెద్దపీట

ఎమ్మెల్యే ఆళ్ల నాని



సంక్షేమ పథకాలపై మహిళలను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: పేదలకు సంక్షేమ పథకాలు అందించటం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 99వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం శుక్రవారం చేపట్టారు. ఆదివారపుపేట సాల్వేషన్ ఆర్మీ చర్చి ప్రాంతం నుంచీ పాదయాత్రగా ప్రతి ఇంటికీ వెళుతూ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయో ఆరా తీశారు. 45వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి సాదరస్వాగతం పలికారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఏపీలోని అనేక పథకాలు నేడు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలకు వాస్తవాలను గుర్తించారని చెప్పారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా ఏలూరు నగరంలో అభివృద్ధి ఏమి చేసిందో ప్రజలకు తెలుసన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్ళ కాలంలో ఏలూరు నగరంలో ఎంతో అభివృద్ధి చేసిందని తెలిపారు. ఒక్క ఏలూరు నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామనీ గుర్తు చేశారు. టిడ్కో ఇళ్ల పేరుతో జనాల్ని టీడీపీ నేతలు దోచుకుంటే మన ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే నాని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయ నిర్మల, తుమరాడ స్రవంతి, పొలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్, కవలకొల్లు సాంబ, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, మాగంటి హేమసుందర్, అమీనా అన్సారీ, లూటుకుర్తి సుభాష్ తదితరులు ఉన్నారు.

బుద్ధ పార్కు పునఃప్రారంభం

ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్



బుద్ధ పార్కును ప్రారంభిస్తున్న మేయర్ నూర్జహాన్, చిత్రంలో కార్పొరేటర్ శ్రీదేవి, కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్ : ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా బుద్ధ పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దామని, ప్రజలకు ఉల్లాసాన్ని ఇచ్చేలా పార్కును అభివృద్ధి చేశామని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. కరోనా విలయం సమయంలో అనివార్య కారణాలతో మూతపడిన బుద్ధపార్కును శుక్రవారం మేయర్ నూర్జహాన్ పునఃప్రారంభించారు. ఆసియా ఖండంలోనే ప్రముఖమైన బుద్ధ విగ్రహాల్లో ఏలూరు బుద్ధపార్కులోని 74 అడుగుల ఎత్తైన బుద్ధ విగ్రహం ఒకటని చెప్పారు. బోట్ షికార్, వాటల్ ఫౌంటేన్, క్యాంటీన్ ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే జెట్ ఫౌంటేన్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించటమే లక్ష్యంగా పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. నగరంలోని మిగిలిన పార్కులను కూడా సుందరీకరించి, అందుబాటులోకి తెస్తామని తెలిపారు. వేసవికాలంలో సాయంత్రం వేళల్లో మంచి వాతావరణాన్ని ఆస్వాదించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏలూరు వన్‌టౌన్ స్థానిక కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, కాంట్రాక్టర్ గోలి శరత్‌రెడ్డి, పాలడుగు మురళీశ్యామ్ తదితరులు ఉన్నారు.

కనకదుర్గమ్మ వారికి వెండి కుందుల సమర్పణ



కనకదుర్గమ్మవారికి వెండి కుందులు అందజేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి దీప సేవ నిమిత్తం భక్తులు వెండి కుందులు సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు తెలిపారు. నగరానికి చెందిన కె.రామచంద్రుడు, పి.నాగమణి దంపతులు 860.200 గ్రాముల బరువున్న వెండి కుందులను శుక్రవారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈఓ శంకరరావుకు అందించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కుందులు సమర్పించిన భక్తులకు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

రజకుల సమస్యలపై సీఎం స్పందన హర్షణీయం

ఏలూరు (టూటౌన్): రజకుల సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని రజక జన సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య పేర్కొన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రజకుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆసరా కార్యక్రమం ప్రారంభోత్సవానికి జిల్లాకు విచ్చేసిన సందర్భంలో వినతి పత్రం అందించామన్నారు. దీనిపై సీఎం కార్యాలయ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రజక వృత్తి చెరువుల జీఓలను అమలు చేయాలని, వృత్తి చేసే రజక స్త్రీలపై వేధింపులను అరికట్టేందుకు అట్రాసిటీ చట్టం చేయాలని, మెట్ట ప్రాంతాల్లో వృత్తి చెరువుల వద్ద మోటారు బోర్లు, ఎలక్ట్రికల్ కనెక్షన్‌లు మంజూరు చేయాలని, విశ్రాంతి భవనాలు, దోబీఘాట్‌ల నిర్మాణానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.20 కోట్లు మంజూరు చేయాలని, వృత్తి చెరువుల అక్రమణను తొలగించాలని, ద్వారకాతిరుమలలో రజకుల కల్యాణ మండపానికి 15 సెంట్లు స్థలం, భవన నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.25 లక్షలు మంజూరు చేయాలని, జగనన్న చేదోడు పథకంలో రూ.10 వేల సాయం అందించే విషయంలో నిబంధనలు సడలించాలని, రజకులకు ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు చెప్పారు.

గొప్ప మానవతావాది గౌతమ బుద్ధుడు



బుద్ధ పూర్ణిమ సందర్భంగా గౌతమ బుద్ధునికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సమ సమాజ నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించి మంచి సమాజాన్ని నిర్మించడానికి కృషి చేసిన మానవతావాది గౌతమ బుద్ధుడు అని ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావు పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గౌతమ బుద్ధుని 2,567వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు చెప్పిన పంచశీల విసర్గాలు, అష్టాంగ మార్గాలు ప్రతి మానవుడు పాటించినట్టే మంచి సమాజం ఏర్పడటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సామాజిక పరిస్థితులను అర్థం చేసుకొని మానవ విలువలను నెలకొల్పడం కోసం బుద్ధుడు చెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళిత మహాసభ సీనియర్ నాయకులు కొరబండి బాబూరావు మాట్లాడుతూ బుద్ధుడు నేను దేవుడ్ని కాదు మానవుడిని మాత్రమే అని చెప్పిన నాటి బ్రాహ్మణ వ్యవస్థ బుద్ధుని దశావతారం చేసిన చరిత్ర నాడు ఉన్నదని చెప్పారు. నాడు దశావతారం చేసిన బ్రాహ్మణులు ఆయన జయంతిని చేయకపోవడం బాధకరమన్నారు. నేటికైనా శూద్రులు వాస్తవాలను తెలుసుకొని చరిత్రను తెలుసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పల్లా యేసేబు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి

ఏలూరు (టూటౌన్): అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలుల వల్ల రాష్ట్రంలో పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో అకాల వర్షాలు వల్ల వరి, మొక్కజొన్న, పసుపు, అరటి, మిర్చి, కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలకు ఎకరాకు రూ.20 వేలు, పసుపు, అరటి,మిర్చి తదితర వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారంగా ఇవ్వాలని కోరారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, పంటల బీమా పరిహారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావులు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేయాలన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని వారు కోరారు.

ఎగ్జిబిషన్ ఏర్పాటు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యులు పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవి సెలవులను పిల్లలు, పెద్దలు ఆస్వాదించే విధంగా ట్రేడ్ ఫేర్ ఎక్జిబిషన్‌ను ఏలూరు నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏలూరు నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్థానిక శనివారపుపేట తివాచి సెంటర్లోని ఎగ్జిబిషన్ మైదానంలో వెంకటేశ్వర ట్రేడ్ ఫేర్ ఎక్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు ఆహ్లాదం పొందేలా ఫారిన్ సెట్టింగ్స్, జెయింట్ వీల్, కొలంబస్, డ్రాగన్ ట్రైన్లతో పాటు మహిళలకు కావాల్సిన అన్ని రకముల వస్త్రాభరణాలు ఈ ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో ఈ ఎగ్జిబిషన్ నగర వాసుల ముందుకు తీసుకురావడం శుభపరిణామమన్నారు. రకరకాల సన్నివేశాలతో కూడిన సెట్టింగ్స్‌ను నిర్వాహకులు ప్రదర్శనకు ఉంచారన్నారు. ఇటువంటి సెట్టింగ్స్‌తో కూడిన ఎగ్జిబిషన్ చూసేందుకు వచ్చే నగరవాసులు తమ మొబైల్ ఫోన్లలో ఫొటోలు తీసుకునే సదుపాయం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేసి శ్రీనివాస్, కార్పొరేటర్లు అద్దంకి హరిబాబు, గునుపూడి శ్రీను, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, వెంకటేశ్వర ట్రేడ్ ఫేర్ ఎక్జిబిషన్ నిర్వాహకులు పప్పల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



లాకా వెంగళరావు, ఎలగల నూకాలమ్మను అభినందిస్తున్న గోపి

ఏలూరు (టూటౌన్): బీసీలంతా ఏకతాటిమీదకు రావాల్సిన ఆవశ్యత ఎంతైనా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు, ఏపీ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం రాజమండ్రిలో జరిగిందన్నారు. జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర నూతన నాయకత్వాన్ని ప్రకటించినట్టు ఆయన ఏలూరులోని సంఘ కార్యాలయంలో వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షునిగా లాకా వెంగళరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎలగల నూకాలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు. వీరికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో జనగణన చేపట్టి అందులో కులగణను కూడా చేయాలని కేంద్రాన్ని కోరారు. బీసీల హక్కులు సాధించాలంటే ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో బీసీలందరూ రాజకీయాలకు అతీతంగా ఏకతాటి మీదకు రావాలని, ఐక్యంగా పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు ఈదలాడ నాని తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను కాపాడాలి



వయోలిన్ కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ సంగీత రంగానికి మన శాస్త్రీయ కళలు దిక్సూచి వంటివని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో ప్రముఖ సంగీత కళాకారిని చల్లపల్లి సీతాదేవి జ్ఞాపకార్థం శుక్రవారం వయోలిన్ సోలో సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కళలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి దువ్వి హేమసుందర్, కోశాధికారి దేవరకొండ అచ్యుత్ కుమార్, కమిటీ సభ్యులు ఎస్వీ గంగా భవాని, పి.కనకదుర్గ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని చల్లపల్లి లక్ష్మీ నరసింహ కృష్ణన్, సువర్చల పర్యవేక్షించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	10
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	06
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

యాసిడ్ దాడి నిందితుడిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ఎంఆర్‌సీ కాలనీలో ఉంటున్న మహిళపై ఆమె భర్త యాసిడ్ పోయడంతో ఆమె కుడికాలు, నడుముపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉండడంతో వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పెదపాడు మండలం రాజుపేటకు చెందిన ధరణి, పెదవేగి మండలం కూచింపూడికి చెందిన నాగేంద్ర వరప్రసాద్‌తో మూడేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. నాగేంద్ర వరప్రసాద్ ఏలూరు నగరంలో ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ తంగెళ్ళమూడి ఎంఆర్‌సీ కాలనీలో నివాసం ఉంటుండగా ధరణి ప్రస్తుతం 3 నెలల గర్భిణి. రెండు రోజుల క్రితం ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. శుక్రవారం రాత్రి గొడవ జరగటంతో తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త వరప్రసాద్ తన భార్యను కొట్టటంతోపాటు బాత్‌రూమ్ కడిగే యాసిడ్ పోయటంతో ఆమెకు గాయాలయ్యాయి.

ఏలూరులో యాంటీ డాగ్ బర్త్ కంట్రోల్ సెంటర్



ఏబీసీ సెంటర్‌పై సూచనలు చేస్తున్న నగర కమిషనర్ వెంకటకృష్ణ, చిత్రంలో పార్టీ మైనార్టీ నాయకులు అలీఖాన్

ఏలూరు టౌన్: నగరంలో వీధి కుక్కల బెడదకు పరిష్కారం చూపుతూ ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఏలూరు 46వ డివిజన్‌లోని పశువుల వైద్యశాలలో యాంటీ డాగ్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర మైనార్టీ సెల్ నాయకులు రియాజ్ అలీఖాన్ ప్రారంభించారు. ఏలూరు నియోజకవర్గంలో వీధి కుక్కల సమస్యపై ఎమ్మెల్యే ఆళ్ల నానికి ప్రజలు వినతి చేయటంతో ఆయన ప్రత్యేకమైన శ్రద్ధ వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రతి డివిజన్‌కు సంబంధించి రోజూ సుమారుగా 10 కుక్కలను ఏలూరులోని కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రానికి తీసుకొచ్చి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయటంతోపాటు, ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కుక్క కరిచినా ప్రజలకు ఏవిధమైన ఇబ్బంది, హాని లేకుండా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఆయేషా సుల్తానా రియాజ్, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, అధికారులు ఉన్నారు.